క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి విద్యారంగ సమస్యలపై చర్చించారు.

అమ్మ యూత్ ఫౌండేషన్ చేయూత



నెల్లూరు(వీఆర్సీసెంటర్): గుండె జబ్బుతో మంచానికే పరిమితమైన నగరంలోని బీవీనగర్‌కు చెందిన సుభాషిణికి అమ్మ యూత్ ఫౌండేషన్ సభ్యులు సోమవారం నిత్యావసర సరుకులు, నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకుడు రమేష్ మాట్లాడుతూ కొన్నేళ్ల క్రిత భర్త వదిలేయడంతో సుభాషిణి తన కుమార్తెతో కలిసి తల్లి మరియమ్మ వద్ద ఉంటోందని తెలిపారు. గత ఐదేళ్లుగా సుభాషిణి గుండె జబ్బుతో బాధపడుతోందని చెప్పారు. ఆమెకు తల్లి రూ.5 లక్షల వరకు అప్పు చేసి వైద్యం అందించినా ఆరోగ్య పరిస్థితి మెరుగుపడలేదని వివరించారు. ఆమెకు రూ.15 లక్షలు ఖర్చు చేసి గుండె ఆపరేషన్ చేయిస్తే ఆరోగ్యం మెరుగుపడుతుందని వైద్యులు చెప్పారని, అంత మొత్తం లేక దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఆమెకు తమ వంతు సాయంగా ప్రతి నెలా బియ్యం, నిత్యావసర సరుకులు, ఖర్చులకు కొంత నగదు సాయం చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా దాతలు ముందుకొచ్చి సాయం అందించాలని కోరారు. ఫౌండేషన్ సభ్యులు శశికిరణ్, కార్తికేయ, వంశీరెడ్డి, శరత్ కుమార్ పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు వద్ద సోమవారం జరిగింది. బుజబుజనెల్లూరుకు చెందిన మణికంఠ పని నిమిత్తం బైక్‌పై కసుమూరుకు వెళ్లాడు. తిరిగి వెళ్లే క్రమంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద టిప్పర్ అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో మణికంఠకు గాయాలవడంతో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు జాబ్‌మేళా

కోవూరు : మండల కేంద్రంలోని ఎర్రబాట కృష్టారెడ్డి, కౌసల్యమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డీసీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 14 కంపెనీల్లోని 1,227 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జాబ్‌మేళాకు హాజరయ్యే వారు ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గిరిజన విద్యార్థులకు మెటీరియల్స్ వితరణ



ఇందుకూరుపేట : స్థానిక గిరిజన గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 15 మంది విద్యార్థులకు సోమవారం వర్క్‌బుక్స్, మెటీరియల్స్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘ నేత పాట్లూరు శ్రీనివాసులు మాట్లాడుతూ యానాది వెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తలపల రమేష్ అందించిన ఆర్థిక సాయంతో విద్యార్థులకు పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన నేతలు ఆదిశేషయ్య, రమేష్ పాల్గొన్నారు.

పచ్చిబియ్యం ఎగుమతిని కొనసాగించాలి

కోవూరు : కేంద్ర ప్రభుత్వం పచ్చిబియ్యం ఎగుమతిని కొనసాగించాలని డీసీఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి కోరారు. కోవూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని రైతులు అత్యధికంగా వరిసాగు పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. పచ్చిబియ్యం ఎగుమతిని నిలుపుదల చేస్తే రైతులు ఆర్థికంగా నష్టపోతారన్నారు. ఈ విషయమై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని మంత్రిని కోరినట్లు చెప్పారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి ఎంపీటీసీ సభ్యుడు వేణు, బీసీ సెల్ మండలాధ్యక్షుడు మల్లికార్జున్ పాల్గొన్నారు.

అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

నెల్లూరు(బారకాసు): స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలకు ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఏపీజే అబ్దుల్‌కలాం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో భాగంగా ప్రజలు ఫోన్ ద్వారా విన్నవించిన సమస్యలను ఆలకించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత విభాగాల అధికారులకు అందజేసి నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. స్పందన ఎండార్స్‌మెంట్ అర్జీదారులకు అర్థమయ్యేలా ఉండాలని, సెక్షన్ టెక్నికల్ విషయాలను పొందుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేకు సహకరించండి

కేంద్ర హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మంత్రిత్వ శాఖ, స్వచ్ఛాంధ్రప్రదేశ్ సంయుక్తంగా చేపడుతున్న స్వచ్ఛ సర్వేక్షన్-2023 సర్వేకు నగర ప్రజలు ఫీడ్‌బ్యాక్ అందించి సహకరించాలని కమిషనర్ వికాస్‌మర్మత్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. నగరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. అందులో భాగంగా నగర స్వచ్ఛతపై ప్రజలు అందించే ఫీడ్‌బ్యాక్ ఆధారంగా కేంద్రప్రభుత్వం ఏటా ర్యాంకులను ప్రకటిస్తుందని వివరించారు. గతంలో నిర్వహించిన సర్వేల ప్రకారం జాతీయ స్థాయిలో నెల్లూరు నగరం 2108లో 193, 2019లో 134, 2020లో185, 2021లో 106, 2022లో 61వ ర్యాంకు సాధించిందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు సాధించిందన్నారు. ఈ ఏడాది జాతీయస్థాయిలో 30లోపు ర్యాంకు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేకు సంబంధించిన సర్వేలో 1.20లక్షల మందికి పైగా పాల్గొనాల్సి ఉంటుందన్నారు. నెల్లూరు నగరం ఉత్తమ ర్యాంకు పొందేందుకు నగర ప్రజలు మొబైల్‌లో గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఓట్ ఫర్ యువర్ సిటీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆగస్టు 15వతేదీలోగా ఫీడ్‌బ్యాక్‌ను అందించాలని కోరారు.

వృద్ధురాలికి ఆర్థిక సాయం

నెల్లూరు(దర్గామిట్ట): నలుగురు కుమారులను కోల్పోయి వృద్ధాప్యంలో ఎటువంటి ఆదరణ లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఓ వృద్ధురాలికి జిల్లా అధికారులు అండగా నిలిచారు. అల్లీపురానికి చెందిన 90 ఏళ్ల వృద్ధురాలు ఆరణి బుజ్జమ్మ ప్రతిరోజూ నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్‌కు వచ్చి రోడ్డుపై టెంకాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్ ఇస్తున్నప్పటికీ భర్త, కుమారులను కోల్పోయి కుటుంబ పోషణ, మందులకు ఇబ్బందులు పడుతోంది. ఈ విషయం అధికారుల దృష్టికి రావడంతో వారు స్పందించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ హరినారాయణన్ సమక్షంలో వృద్ధురాలికి రూ.17,500 సాయం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులను కలెక్టర్ అభినందించారు. ఆమెకు ప్రతినెలా అవసరమైన మందులు అందించాలని డీఎంహెచ్‌ఓకు సూచించారు. ఆమె అంగీకరిస్తే వృద్ధాశ్రమంలో చేర్పించాలని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, హౌసింగ్ పీడీ నాగరాజు, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్, ఇరిగేషన్ ఎస్‌ఈ కృష్ణమోహన్, తదితరులు ఉన్నారు.



వృద్ధురాలికి ఆర్థిక సహాయం అందజేస్తున్న అధికారులు

గుర్రం జాషువాకు ఘన నివాళి

నెల్లూరు (టౌన్: స్టోన్‌హౌస్‌పేటలోని కేఏసీ జూనియర్ కళాశాలలో ప్రజాకవి గుర్రం జాషువా వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్రపటానికి ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మీసా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ జాషువా రచనల్లో సర్వమానవ సమానత్వం కనబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సురేష్, సుధీర్, పులి చెంచయ్య, శ్రీనివాసులు, లైబ్రేరియన్ బసిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

తెలుగును బోధించాలని వినతి

నెల్లూరు (టౌన్): కేంద్రీయ విద్యాలయంలోని విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే తెలుగును బోధించాలని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్ కోరారు. ఈ మేరకు నెల్లూరు కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ దొరసానమ్మను కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను విద్యతో పాటు కళలు, ఆటలు, పాటల్లోనూ ప్రోత్సహిస్తుండడం అభినందనీయమన్నారు. నూతన జాతీయ విద్యావిధానం-2020 ప్రకారం విద్యార్థులకు మాతృభాషలో ప్రాథమిక విద్యను అందించాల్సిన అవసరం ఉందన్నారు. పీఎం నరేంద్ర మోదీ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో పాటు హైకోర్టు సైతం మాతృభాషల్లో విద్యార్థులకు బోధించాలని సూచించారని వివరించారు. మీ అధికారాన్ని వినియోగించి విద్యార్థులు ప్రాథమిక స్థాయిలో తెలుగును ఓ భాషగా బోధించేలా చూడాలన్నారు. ఆగస్టు 29 తెలుగు భాషా దినోత్సవం రోజు నుంచి తెలుగు భాషను బోధించడం ప్రారంభించాలని కోరారు. ఆయన వెంట పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, శ్రీమన్నారయణ, మోహన్‌రాజు, గోపీనాథ్, తదితరులు ఉన్నారు.



ప్రిన్సిపల్ దొరసానమ్మకు వినతిపత్రం అందజేస్తున్న జయప్రకాష్

మైండ్‌గేమ్ సినిమా పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం): పురమందిరంలో ''మైండ్ గేమ్'' సినిమా పోస్టర్లను జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్‌రాయ్, శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీరామరాజు ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీరామరాజు మాట్లాడుతూ ఎంవీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై మురళి, లక్ష్మి నిర్మాతలుగా కిషోర్ శ్రీకృష్ణ దర్శకత్వంలో ''మైండ్ గేమ్'' సందేశాత్మక సినిమాను నిర్మించారని తెలిపారు. చిన్న చిత్రాలను ప్రేక్షకులు ఆదరించి వర్ధమాన కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్ర హీరోహీరోయిన్లు శ్రీరామ్,విజయలక్ష్మి, మ్యూజిక్ డైరెక్టర్ మహేష్,, సినిమాటోగ్రాఫర్ బాలు,కొరియోగ్రాఫర్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.



బోగస్ కుల సర్టిఫికెట్లు ఇవ్వడం దారుణం

నెల్లూరు(బారకాసు): బీసీ-ఏకు చెందిన 300కు పైగా పాముల కులస్తులకు ఎస్టీ ఎరుకుల కులస్తులుగా బోగస్ కుల సర్టిఫికెట్లు ఇవ్వడం దారుణమని ఆల్‌ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నల్లగొండ శివ అన్నారు. ఈ మేరకు నగరంలోని ఐటీడీఏ కార్యాలయం వద్ద ఆదివాసీ సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ ఆత్మకూరు తహసీల్దార్ లక్ష్మీనరసింహులు బీసీ-ఏకు చెందిన పాముల కులస్తులకు ఎరుకుల కులస్తులని బోగస్ ఎస్టీ కుల సర్టిఫికెట్లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ విషయంపై తాము సదరు తహసీల్దార్‌ను కలువగా సరైన సమాధానం చెప్పకపోగా, ఎస్సైను పిలిపించి తమ కులస్తులను భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. బోగస్ కుల సర్టిఫికెట్లు జారీ చేసిన సదరు తహసీల్దార్‌పై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటీడీఏ అడ్మిన్ ఖలీంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు, రమణయ్య, వెంకటేష్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, హసన్‌కుమార్, మల్లి, హరీష్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎరుకుల హక్కుల పోరాట సమితి నాయకులు

1న శంకరమఠంలో చండీహోమం

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శంకరమఠంలో ఆగస్టు 1న ఉదయం 9 గంటల నుంచి చండీహోమం నిర్వహించనున్నట్లు ఆ మఠం నిర్వాహకులు కొత్రపాటి నందకిషోర్, ఉషాకుమారి దంపతులు సోమవారం తెలిపారు. అధిక శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని కంచికామకోటి పీఠానికి చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించే చండీహోమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

స్థల వివాదంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): స్థల వివాదంపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మినీ బైపాస్‌లోని కావేరి అపార్ట్‌మెంట్‌లో మురళీధర్ నివాసం ఉంటున్నారు. ఆయన భార్య పేరుపై కొండాయపాలెంలో శ్రీదేవి లేఅవుట్‌లో మూడుప్లాట్లు ఉన్నాయి. ఓ ప్లాట్‌లో చిన్న ఇంటిని నిర్మించారు. మూడ్రోజుల కిందట నగరానికి చెందిన దిలీప్, వసంతకుమార్, నాగరాజు, ప్రేమ్ మరో 20 మందితో కలిసి అక్కడకు చేరుకుని ప్లాట్లను ఖాళీ చేయమని మురళీధర్‌పై ఒత్తిడి తెచ్చారు. ఆయన నిరాకరించడంతో నిందితులు ప్లాట్లలోకి అక్రమంగా ప్రవేశించి జేసీబీ సాయంతో ఇంటిని కూల్చివేసేందుకు యత్నించారు. అడ్డుకోయిన మురళీధర్‌పై దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడు ఈ నెల 23న రాత్రి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రామ్మోహన్‌కు డాక్టరేట్

నెల్లూరు (టౌన్): నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్స్ ఇంజినీరింగ్ విభాగంలో అధ్యాపకుడిగా పని చేస్తున్న చిన్నెమ్ రామ్మోహన్‌కు డాక్టరేట్ లభించింది. అసోసియేట్ ప్రొఫెసర్లు ఎస్ కిరణ్, వాసుదేవ పర్యవేక్షణలో 'హైబ్రిడ్ వావ్‌లెట్ అప్రోచ్ ఫర్ మల్టీఫోకస్ ఇమేజ్ ఫ్యూజన్ బేస్డ్ ఆన్ టెక్చర్ అండ్ పీసీఏ ఫర్ ఇమేజ్ క్వాలిటీ ఎన్‌హాన్స్‌మెంట్' అనే అంశంపై పరిశోధనలు సాగించడంతో కర్ణాటక రాష్ట్రం బెల్గావిలోని వీటీయూ వర్సిటీలో డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌ను నారాయణ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి, సీఎస్‌ఈ విభాగాధిపతి రాజేంద్ర, ఇతర విభాగాధిపతులు సోమవారం సత్కరించి అభినందించారు.

27న సుస్వరాభిషేకం



నెల్లూరు(బృందావనం): సినీ ఆర్కెస్ట్రా మ్యూజిషియన్స్ అసోసియేషన్ ఆఫ్ నెల్లూరు ఆధ్వర్యంలో ఈ నెల 27న పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం ప్రాంగణంలో సుస్వరాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుస్వర రాజశేఖర్, ఇమ్మారెడ్డి పెంచలరెడ్డి తెలిపారు. సోమవారం వారు నగరంలోని రేబాలవారివీధిలోని సుస్వర మ్యూజికల్ వరల్డ్‌లో సుస్వరాభిషేకం ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. జూలైలో జన్మించిన ప్రముఖ సినీ సంగీతదర్శకులు, గాయకులు మంగళంపల్లి బాలమురళీకృష్ణ, ఏఎం రాజా జయంతి, కీరవాణి, మణిశర్మ, ఉన్నికృష్ణన్, చిత్ర, దామిని, అనురాధ శ్రీరామ్, మాళవిక, సమీరాభరద్వాజ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని వారు స్వరపరచిన, ఆలపించిన పాటలతో సుస్వరాభిషేకం చేయనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా నిరుపేద ఆర్కెస్ట్రా కళాకారులకు ఆర్థిక సాయం చేయనున్నట్లు వెల్లడించారు. సాయంత్రం 6గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి సంగీతాభిమానులు,కళాకారులు హాజరై జయప్రదం చేయాలని కోరారు బుల్లితెర నటుడు ఎస్ మురళీమోహన్ రావు, శ్రీవాసవిఆర్కెస్ట్రా, ఈవెంట్స్ అధినేత్రి ప్రశాంతి పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు (దర్గామిట్ట): కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఎం హరినారాయణన్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాలను కేంద్ర బృందాలు సందర్శించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించి పాయింట్లు కేటాయిస్తాయన్నారు. ప్రతి గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా చూడాలని అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల ప్రకారం ప్రధానంగా పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, చెత్త సేకరణ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని గ్రామాలు మంచి పాయింట్లు సాధించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, డీఆర్వో వెంకటనారాయణ, డీపీఓ సుస్మితా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

నిబంధనల మేరకే ఏపీవీఆర్ఏ జిల్లా కమిటీ ఎన్నిక

నెల్లూరు(బారకాసు): నిబంధనల మేరకే ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం(ఏపీవీఆర్ఓఏ) జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 13 ఏళ్లుగా ఏపీవీఆర్ఓఏ జిల్లా అధ్యక్షుడిగా చెప్పుకుంటున్న పంట అశోక్‌కుమార్‌రెడ్డి ఏనాడు వీఆర్వోల సమస్యల పరిష్కారానికి కృషి చేయలేదని ఆరోపించారు. కేవలం తన స్వార్థం కోసమే జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారన్నారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి జిల్లా కమిటీకి ఎన్నికలు జరపాల్సి ఉండగా, గత ఆరేళ్లుగా ఎందుకు నిర్వహించలేని ప్రశ్నించారు. అశోక్‌రెడ్డితో పాటు మరికొందరు నాయకులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ)తో కలిసి ఉన్నారన్నారు. జిల్లాలోని వీఆర్వోలు అధిక శాతం మంది ఏపీవీఆర్ఓ రాష్ట్ర సంఘంతోనే ఉన్నారని స్పష్టం చేశారు. రాష్ట్ర వీఆర్ఓఏ సంఘ నాయకుల ఆదేశాల మేరకు నిబంధనల మేరకు ప్రజాస్వామ్యబద్ధంగా తాము అధికశాతం మంది వీఆర్వోల ఆమోదంతో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు. తమ ఎన్నికకు సంబంధించిన పూర్తి వివరాలను జిల్లా రెవెన్యూ అధికారికి సమర్పించామన్నారు. తమపై బురదజల్లడానికే అశోక్‌రెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి దారా వెంకటరమణయయ్య, కోశాధికారి బీ పెంచలరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సురేష్

ఘనంగా పినాకిని యూత్ అసోసియేషన్ వార్షికోత్సవం

నెల్లూరు(బృందావనం): పురమందిరంలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ 16వ వార్షిక వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఉభయతెలుగు రాష్ట్రాల్లో విశిష్ట సేవలందిస్తున్న వివిధ రంగాలకు చెందిన నిర్వాహకులకు కీర్తి పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరించారు. కాకినాడకు చెందిన సమాజ సేవకుడు, భట్రాజు సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షుడు చక్రాల ఫకీర్‌రాజు, వరంగల్‌కు చెందిన స్వచ్ఛంద సేవకురాలు, యూట్యూబ్ స్టార్ సవరం రోజీరంజితకు విశిష్టసేవారత్న పురస్కారాలను అందజేసి సన్మానించారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్‌రాయ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత 16 ఏళ్లుగా మురళీమోహన్‌రాజు చేపడుతున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో కొండూరు హరినారాయణరెడ్డి, పీ శ్రీరామరాజు, బీ ఆనందయ్య, మెట్టు రామచంద్ర ప్రసాద్, ఆర్‌ఆర్ గాంధీ, నాగరాజన్, టీ సువర్ణ కుమారి, పీ ప్రదీప్, అందె శ్రీనివాసులు, స్వర్ణసుప్రవీణ, కప్పా మురళీమోహన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.



ఫకీర్‌రాజుకు సత్కారం

కోటంరెడ్డికి విమర్శించే అర్హత లేదు



నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరు కార్పొరేషన్‌కు జరిగిన ఎన్నికల్లో ఒక్క కార్పొరేటర్‌ను కూడా గెలిపించుకోలేకపోయిన టీడీపీ నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులను విమర్శించే అర్హత లేదని నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి జీవీ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వెంకటగిరిలో జరిగిన బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే బాలకృష్ణ గతంలో మహిళలపై చేసిన వ్యాఖ్యలను మాత్రమే ప్రస్తావించారని గుర్తుచేశారు. దానిపై సీఎంను విమర్శిస్తున్న కోటంరెడ్డి ఆయన కాలిగోటికి కూడా సరిపోడన్నారు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టడం ఏ గాలికి ఆ చాప ఎత్తడం నీకు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదని కోటంరెడ్డిని విమర్శించారు. 1988లో మాధవ్ సినిమా హాల్‌లో రక్తాభిషేకం సినిమా ఆడుతున్న సమయంలో పోస్టర్లను చెప్పులతో కొట్టిన వ్యక్తి నీవేనని, అలాంటి నిన్ను టీడీపీ నుంచి బహిష్కరించే రోజు త్వరలోనే వస్తుందని, అది ముందు నువ్వు చూసుకోవాలని హితువుపలికారు.

వేతనాల చెల్లింపుల్లో జాప్యంపై ఆందోళన

నెల్లూరు(బారకాసు): వేతనాల చెల్లింపుల్లో జాప్యం లేకుండా ప్రతి నెలా అందేలా చూడాలని ప్రభుత్వ బోధనాస్పత్రిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న స్టాఫ్‌నర్సులు కోరారు. ఈ మేరకు ఏసీఎస్సార్ ప్రభుత్వ వైద్యకళాశాలలోని ప్రిన్సిపల్ చాంబర్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ బోధనాస్పత్రిలో దాదాపు 213 మందికి పైగా స్టాఫ్‌నర్సులు కాంట్రాక్ట్ ప్రాతిపాదికన పని చేస్తున్నారని తెలిపారు. తమకు జూలై నెల ముగిసిపోతున్నా ఇప్పటి వరకు జూన్ నెల వేతనాలను చెల్లించలేదన్నారు. ఈ విషయమై వైద్యకళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ సునీతపురుషోత్తంను సంప్రదించగా సరైన సమాధానం ఇవ్వలేదని ఆరోపించారు. గతంలో కళాశాలలోని పరిపాలన విభాగంలో పనిచేసిన కాంట్రాక్ట్ ఉద్యోగి సుష్మా ఫ్లోరెన్స్ తమ జీతాల బిల్లులను సకాలంలో ట్రెజరీకి పంపించేదని, తమకు జీతాలు సక్రమంగా అందేవని తెలిపారు. ఇటీవల ఆమె స్థానంలో వేతనాల బిల్లులపై అనుభవం లేని మరో క్లర్క్‌ను ఏడీగా నియమించడంతో తమకు జీతాలు సకాలంలో అందడం లేదని ఆరోపించారు. ఇకనైనా వేతనాల బిల్లుల వర్క్ బాగా తెలిసిన ఉద్యోగిని నియమించి త్వరితగతిన తమకు వేతనాలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. స్పందించిన వైద్యకళాశాల ప్రిన్సిపల్ వేతనాలు వీలైనంత త్వరగా చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.



ఆందోళన చేపడుతున్న స్టాఫ్ నర్సులు

వృద్ధాశ్రమంలో దుప్పట్ల పంపిణీ

నెల్లూరు రూరల్: కొత్తకాలువ సెంటర్‌లోని బాపూజీ వృద్ధుల ఆశ్రమంలోని 100 మంది వృద్ధులకు గోపాల్‌రెడ్డి, సరోజనమ్మ జ్ఞాపకార్థంగా సోమవారం దుప్పట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వృద్ధులకు దుప్పట్లు అందజేసిన దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో హరినాథ్‌రెడ్డి, గిరిజమ్మ, స్థానిక కార్పొరేటర్ నాగరాజు, నాయకులు కమలాకర్ రెడ్డి, శివసునీల్‌రెడ్డి, యేసునాయుడు, హరిబాబుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రంగారెడ్డి

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

ఇందుకూరుపేట: పంటలతో పాటు రైతు వివరాలను కూడా తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ సూచించారు. ఇందుకూరుపేటలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు మండలాలకు చెందిన వ్యవసాయశాఖ సిబ్బందికి ఈక్రాప్ నమోదుపై సోమవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్‌లో పంటతో పాటు రైతు వివరాలు నమోదైతేనే ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసే అవకాశం ఉంటుందన్నారు. అలాగే కౌలు రైతులు సీసీఆర్ కార్డుల కోసం ఆర్బీకేల్లో సంప్రదించేలా అవగాహన కల్పించాలని కోరారు. అలాగే తప్పనిసరిగా ఈకేవైసీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.